క్లుప్తంగా

రైతులను ఆదుకోవాలి

చెన్నారావుపేట : పంటలు నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు నూకల కృష్ణ యాదవ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు ఎక్కువ మొత్తంలో నష్టపరిహారం అందలేదని రీ సర్వే చేసి పరిహారం అందించాలన్నారు. అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. పంట వేయని రైతులకు చెక్కులు రావడం సిగ్గుచేటన్నారు. బాధిత రైతులను గుర్తించి చెక్కులు అందించాలని లేనిఎడల బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

నియామకం



నర్సంపేట : గౌడ జనహక్కుల పోరాట సమితి మోకుదెబ్బ డివిజన్ ఉపాధ్యక్షుడిగా నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన నాగపురి రమేష్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు నర్సంపేట పట్టణంలో మోకుదెబ్బ డివిజన్ కమిటీ సమావేశం శనివారం డివిజన్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల రమేష్‌గౌడ్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా గౌడ కులస్తుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న నాగపురి రమేష్‌గౌడ్‌ను డివిజన్ ఉపాధ్యక్షుడిగా నియమించడం జరిగిందని తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు

సంగెం : మండలంలోని షాపూర్‌లో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం రెండో రోజు వైభవంగా నిర్వహించారు. శనివారం వివిధ పూజ కార్యక్రమాలు తీర్థప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సట్ల రాజు దంపతులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయిని పహాడ్ గ్రామానికి చెందిన ఏటుకూరి అర్లయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా అర్లయ్య మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మొగిలి వెంకట్‌రెడ్డి, యాకయ్య, రమేష్, జయరాజ్, హరీష్ ఉన్నారు.

బాధితులకు ఉషాదయాకర్‌రావు..



రాయపర్తి : మండలంలోని కొండూరు గ్రామంలో ఇటీవల మృతిచెందిన గంగారపు నర్సయ్య, గుండె బన్ని, గోలి అనసూర్య, ఎదుల్ల యాకస్వామి, రామారపు మల్లయ్య కుటుంబాలను ఎర్రబెల్లి దయాకర్‌రావు ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు శనివారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని జయరాంతండా(కె)కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు లావుడ్యా మున్యానాయక్ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సదర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

మావోకు ఘన నివాళి



నర్సంపేట : చైనా విప్లవ నాయకుడు, మార్క్సిస్టు మహోపాధ్యాయుడు మావో వర్ధంతిని పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ మేరకు మావో చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు గట్టి కృష్ణ మాట్లాడుతూ ఆధునిక ప్రపంచ చరిత్రలో అత్యంత ప్రభావ వంతమైన వ్యక్తులలో మావో ఒకరని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్, ఏఐకేఎంఎ డివిజన్ నాయకులు మల్లన్న, సారయ్య, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

'పెద్ది'పై విమర్శలు సరికాదు



చెన్నారావుపేట : పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో సీఎం కేసీఆర్‌ను ఒప్పించి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ పార్టీ కన్వీనర్ కంది కృష్ణారెడ్డి, ఆర్‌బీఎస్ కన్వీనర్ తిరుపతి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- ఎమ్మెల్యే అరూరి రమేశ్



పర్వతగిరి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

వర్ధన్నపేట / పర్వతగిరి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందజేస్తున్న వడ్డీ లేని రుణంతో పాటు పావలా వడ్డీ రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. శనివారం వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తి, బొక్కలగూడెం గ్రామాల మహిళా సంఘాలు, పర్వతగిరి మండలంలోని అన్నారం, కల్లెడ గ్రామాల మహిళా సంఘాల వార్షిక మహాసభకు అరూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడ లేని విధంగా మహిళా సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారన్నారు. మహిళా సాధికారిత కోసం అనేక సంక్షేమ పథకాలను రూపొందించి వాటిని అమలు చేస్తున్న గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో మహిళలు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని తెలిపారు. చాలా కాలంగా ఎదురు చూస్తున్న వీఓఏల గౌరవ వేతనం పెంచి మహిళల పట్ల తన అభిమానాన్ని చాటుకున్నారన్నారు. అనంతరం ల్యాబర్తి మహిళా కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.10 లక్షల ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఇటీవల జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ తీసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, పార్టీ మండల అధ్యక్షుడు తూల్ల కుమారస్వామి, సర్పంచ్‌లు పస్తం రాజు, నారాయణ, ఉప సర్పంచ్ పిన్నింటి కళింగరావు, ఎంపీటీసీ అన్నమనేని ఉమదేవి యతిరాజారావు, మహిళ సంఘాల సభ్యులు, పర్వతగిరిలో ఎంపీపీ లూనావత్ కమలపంతులు, జెడ్పీటీసీ సింగ్‌లాల్, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

పర్వతగిరి మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన గొల్లపల్లి మహేందర్ కూతురు అశ్వితశ్రీ అగర్తలోని ఎన్ఐటీలో సీటు సాధించింది. కాగా ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్న విషయం ఎమ్మెల్యే అరూరి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన రమేశ్ అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ద్వారా కళాశాల ఫీజు నిమిత్తం శనివారం క్యాంపు కార్యాలయంలో రూ.32 వేల నగదును విద్యార్థి తండ్రికి అందజేశారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి
- అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



నల్లబెల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నల్లబెల్లి : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం కేసీఆర్ నేతృత్వంలో నియోజకవర్గ ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుండ్లపహాడ్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా పెద్ది పాల్గొని భూమి పూజ చేశారు. స్థానిక కార్యకర్తలతో కలిసి రాజరాజేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అన్ని సామాజిక వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అభివృద్ధిలో వెనకబడిన గుండ్లపహాడ్ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దామని, రాబోయే ఎన్నికల్లో మీ ఆశీర్వాదం ఉంటే గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే మండలంలోని రాంతీర్థం గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే పెద్ది ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

నర్సంపేట : నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం దుగ్గొండి మండలం గుడ్డేలుగులపల్లి నుంచి, నెక్కొండ మండలం దేవునితండా, దీక్షకుంట గ్రామాల నుంచి కాంగ్రెస్, ఇతర పార్టీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నర్సంపేట : నర్సంపేటలో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీభూనీల సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణాన్ని ఆలయ అర్చకులు రామానుజాచార్యులు జరిపించగా భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు వేమిశెట్టి శ్రీనివాస్‌రమాదేవి, శింగిరికొండ మాధవ శంకర్‌రజని, గిరగాని సాంబయ్య, శింగిరికొండ రవీందర్, రామగోని సుధాకర్, దుబ్బ రమేష్, పుట్ట సంపత్, పాలాయి రవి, మహిళలు, భక్తులు, పాల్గొన్నారు.

ఆదర్శంగా లీడ్ గ్రంథాలయం



నర్సంపేట : ప్రముఖ కవి, ఉపాధ్యాయుడు కాసుల రవికుమార్ నిరుపేద విద్యార్థుల వికాసమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన లీడ్ గ్రంథాలయ సేవలు చరిత్రలో నిలిచిపోతాయని కంది గోపాల్‌రెడ్డి, డాక్టర్ మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు పట్టణంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ నూతన గదులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాళోజీ జయంతి సందర్భంగా అతిథులు కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలో ప్రారంభమైన లీడ్ గ్రంథాలయం ఒక మహోద్యమంగా రూపు దాల్చిందని, ఎందరో వ్యక్తులు, వ్యవస్థలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. చిన్నతనం నుంచి విద్య విలువ తెలిసిన వ్యక్తిగా, ఈరోజు ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో రవికుమార్ వెలుగులు నింపుతున్నారని తెలిపారు. టెక్నాలజీకి బానిసలుగా మారుతున్న పిల్లలను పుస్తకాల బాట పట్టించాలనే తన ఆలోచనకు అందరూ సహకరించాలని కోరారు. కాసుల రవికుమార్‌శోభరాణి దంపతులు నిర్వహిస్తున్న లీడ్ గ్రంథాలయాలు మరి ఎంతో మందికి ఆదర్శంగా నిలవాలని అన్నారు.

'బీసీ సింహగర్జన' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీసీ నాయకులు

నెక్కొండ : రాష్ట్రంలో 60 శాతం జనాభా ఉన్న బీసీలు అన్ని రంగాల్లో వెనకంజలో ఉన్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల హరిప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నేడు (ఆదివారం) హైదరాబాద్‌లో నిర్వహించే బీసీ సింహగర్జన వాల్‌పోస్టర్, కరపత్రలను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దమాషా ప్రకారం చట్ట సభల్లో బీసీలకు దక్కాల్సిన వాటా దక్కించుకోవడం కోసం బీసీలు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రకటించిన సీట్లలో బీసీలకు తీరని అన్యాయ జరిగిందని ఆయన ఆరోపించారు. బీసీలకు తగిన ప్రాధాన్యత నివ్వని పార్టీలకు తగిన గుణపాఠం చెప్పేందుకు సరూర్‌నగర్‌లో జరిగే సభకు ఇంటికో వ్యక్తి, ఊరికో వాహనం ఎక్కి స్వచ్ఛందగా తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు కదురు సాంబయ్య, బండి శివకుమార్, రాచకొండ రఘు, లక్ష్మణ్, కక్కెర్ల నాగయ్య, ఊడ్గుల అశోక్, మాదాటి శ్రీనివాస్,దూదిమెట్ల మల్లిక్‌యాదవ్, బండారి అనిల్, చిన్నూరి కార్తిక్, తిప్పని రమేష్, మెండె రవి, గడ్డం ఆనందరం, పదాల రవి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



కుంటపల్లిలో మాట్లాడుతున్న శంకరయ్య

సంగెం : నిత్యావసర సరుకుల ధరలు, కరెంట్ చార్జీలు వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వీరగోని శంకరయ్య డిమాండ్ చేశారు. శనివారం కుంటపల్లిలో సీపీఐ మండల కమిటీ సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షుడు జున్న సాంబయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరుకుల ధరలు పెంచడంతో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందన్నారు. కరెంట్ చార్జీలు పెంచడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు తగ్గించాలని సోమవారం సంగెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి పలక ప్రసాద్, జున్న మణెమ్మ, ఆరెల్లి కల్యాణి, ఇమ్మడి కృష్ణ, సంపెట రాములు, మెట్టుపల్లి స్వామి, ఇమ్మడి సంతోష్, యాకయ్య, కోట సారయ్య, బొడ్డుపల్లి సాయిలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

దుగ్గొండి : ప్రమాదవశాత్తు రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన లక్ష్మీపురం సమీపంలో శనివారం సాయంత్రం జరిగింది. నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన రఘుసాల ప్రవీణ్ తన అక్క జ్యోతితో కలిసి ద్విచక్ర వాహనంపై వరంగల్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన రాంబాబు లక్ష్మీపురం నుంచి దుగ్గొండికి వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ప్రవీణ్, జ్యోతి, రాంబాబుకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ప్రైవేట్ వాహనంలో వరంగల్‌కు తరలించారు.

అశోక్ లేలాండ్ వాహనాన్ని ఢీకొన్న లారీ

రాయపర్తి: అతివేగంగా అశోక్ లేలాండ్ వాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ వైపు నుంచి తొర్రూరుకు వస్తున్న అశోక్ లేలాండ్ వాహనాన్ని ఖమ్మం నుంచి వరంగల్ వెళ్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనాల్లో ఉన్న ఎవరికి గాయాలు కాలేదు. ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

ఖానాపురం : మండల కేంద్రానికి చెందిన వెంకటప్రసాదరావు తనకు పంట నష్ట పరిహారం రాలేదని దురుసుగా ప్రవర్తించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించి కులం పేరుతో దూషించి అవమానించారని ఏఈఓ తుప్పరి సంధ్య ఫిర్యాదు చేశారు. దీంతో ఫిర్యాదును స్వీకరించి శనివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాధవ్ తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

శాయంపేట : గర్భిణులు, బాలింతలు, తల్లులు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఏఎన్ఎం రోసిలిన్ అన్నారు. జాతీయ పోషణ మాసాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని జోగంపల్లి, సూర్జహాన్‌పల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, తల్లులతో ఆమె పోషణ ప్రతిజ్ఞ చేయించారు. రోసిలిన్ మాట్లాడుతూ.. బాలింతలు పోషకారం, చిరుధాన్యాలు, ఆకు కూరలుఎక్కువగా తీసుకోవడం వల్ల బిడ్డ ఎదుగుదల బాగుంటుందని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

నెక్కొండ : రాష్ట్రస్థాయి నెట్‌బాల్ క్రీడాపోటీలకు విద్యోదయ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న హనుమకొండలోని జేఎన్ఎస్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు వాహిని, సహస్ర, ఐశ్వర్య, జాహ్నవి, వాసవి, రాజేశ్వరి, అక్షయనాయక్, శ్రీవల్లి, ధరణిరెడ్డి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. నిర్మల్‌లోని జేవీఎస్‌ఆర్ స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ అభినందించారు. పాఠశాల డైరెక్టర్ చల్లా పారిజాతం, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాళ్లు షరీఫ్, పీఈటీ అఖిల్ పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' పనులు ప్రారంభం



ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ఖానాపురం : ఇళ్లు లేని పేదలకు గృహలక్ష్మి వరంగా మారనుందని ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి నాయక్, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని వేపచెట్టుతండాలో గృహలక్ష్మి ద్వారా ఇంటి నిర్మాణానికి శనివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లు లేకుండా ఉన్న వారికి పథకం ద్వారా నిధులు మంజూరు కానున్నాయన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. సర్పంచ్ భూక్యా పద్మావతివెంకన్న, ఉపసర్పంచ్ మూడు దేవేందర్, బుచ్చ నాయక్, కేత్య నాయక్, రెడ్డి నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

పర్వతగిరి : భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జ్ మల్లాడి తిరుపతిరెడ్డి అన్నారు. ఈ మేరకు పర్వతగిరిలో శనివారం వివిధ బూత్ కమిటీలను మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీ అధ్యక్షులు, సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అడెపు ప్రభాకర్, భోగ సుధాకర్, వెంకటేష్, గూడెల్లి ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామస్తులు సహకరించాలి



రాయపర్తి : గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ చిన్నాల తారశ్రీరాజబాబు కోరారు. శనివారం మండలంలోని పెర్కవేడు గ్రామంలో వర్షాల కారణంగా బురదమయమైన పశువైద్యశాలతో పాటు శివాలయానికి వెళ్లే రోడ్డులో మొరం పోయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పర్వతగిరి : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ మండల అధ్యక్షురాలు రుక్మిణి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేసి రూ.26వేల కనీస వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసి తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అన్నారు. బీఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలని, ఐసీడీఎస్‌కు సంబంధం లేని పనులను చేయించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల నిరసన

వర్ధన్నపేట : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అవినీతి ఆరోపణలపై అరెస్టు కాగా శనివారం వర్ధన్నపేటలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చాడా మరియా కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు.

కాళోజీ రచనలు స్ఫూర్తిదాయకం



దుగ్గొండి: గిర్నిబావి పూలే విద్యాలయంలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



నర్సంపేట: కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్ది



గీసుకొండ: ధర్మారంలో..



చెన్నారావుపేటలో..

నర్సంపేట : తెలంగాణ ఉద్యమంలో కాళోజీ నారాయణరావు రచనలు అందరికీ స్ఫూర్తి దాయకమని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కాళోజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సమాజం కోసం ఆయన చేసిన త్యాగాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్ రాష్ట్ర బాధ్యులు రాయిడి రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, నాగెల్లి వెంకటనారాయణగౌడ్, గుంటి కిషన్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, గోనె యువరాజు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండలో..

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలోని ఎస్ఎస్ కళాశాలలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి తెలుగు భాష, యాసకు చిరునామాగా మారిన ఆయన రచనలను, ప్రజలను చైతన్యులను చేసిన తీరును గుర్తు చేసుకున్నారు. కేయూ దూర విద్యాకేంద్రం కోఆర్డినేటర్ శ్రీకాంత్, అధ్యాపకులు ప్రణయ్, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

దుగ్గొండిలో..

దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయంలో కాళోజీ చిత్రపటానికి ప్రిన్సిపాల్ కూరోజు దేవేందర్ పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, రాజు, సుకుమార్, సోమారాణి, సురేష్, కోటి, కిరణ్, రమేష్, బషీర్, వీరేందర్, కృష్ణమూర్తి, సందీప్, లక్ష్మణ్, సమత, సునిత, అనిత, ప్రేమలత పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడి తొలగింపు?

పర్వతగిరి : మండలంలోని దేవీలాల్‌తండాకు చెందిన జాటోత్ శ్రీనివాస్‌నాయక్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి నుంచి తొలగించినట్లు సమాచారం. పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరదరాజేశ్వర్‌రావు దంపతులు గత నెల పెద్దతండాలో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. అదేరోజు మాల్యతండా శివారు గడ్డపారతండాలో కాంగ్రెస్ నాయకుడు నాగరాజు పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ పెద్దతండా కార్యక్రమంలో పాల్గొని నమిండ్ల శ్రీనివాస్‌తో నువ్వు వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పని చేయవని వాగ్వాదం చేసి నాగరాజు వైపు వెళ్లాడు. ఆ క్రమంలో ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు కలుగజేసుకుని పార్టీ జిల్లా అధ్యక్షురాలి ఆదేశాలను బేఖాతరు చేస్తున్నావని హెచ్చరించారు. దీంతో కులం పేరుతో దూషించాడని వరదరాజేశ్వర్‌రావుపై కేసు నమోదైంది. అంతకు ముందు కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్, దౌలత్‌నగర్‌కు చెందిన సాంబరాజు.. జాటోత్ శ్రీనివాస్‌నాయక్‌పై కేసు పెట్టాడు. కేసు నమోదు కావడానికి కారణం వరద రాజేశ్వర్‌రావు అని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. విషయాన్ని గమనించిన ఎర్రబెల్లి స్వర్ణ.. శ్రీనివాస్‌నాయక్‌ను పార్టీ మండల అధ్యక్ష పదవి నుంచి తొలగించినట్లు సమాచారం. జాటోతు శ్రీనివాస్‌నాయక్‌ను వివరణ కోరగా అందులో భాగంగానే హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు వెళ్లినట్లు తెలిపారు.

లింగ సమానత్వంపై అవగాహన

సంగెం : తల్లిదండ్రులు ఆడ, మగ ఇద్దరిని సమానంగా చూడాలని తరుణి స్వచ్ఛంధ సంస్థ ఫౌండర్ మమతా రఘువీర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో లింగ సమానత్వంపై బాలుర సంఘం సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో బాలురను ఎక్కువగా, బాలికలను తక్కువగా చదివించడం చేయకుండా ఇద్దరికి సమానంగా సపోర్టు చేస్తే అమ్మాయిలు కూడా అబ్బాయితో సమానంగా ఉన్నతస్థాయికి ఎదగుతారన్నారు. తెలంగాణలో అబ్బాయిలు కావాలని అమ్మాయిలని తెలుసుకుని భ్రూణహత్యలకు పాల్పడుతుండడం వల్ల ఆడపిల్లల నిష్పత్తి తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్యవివాహలు, పిల్లలపై లైంగిక హింస, బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడానికి అందరు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో తరుణి సంస్థ సంగెం మండల కోఆర్డినేటర్ రణధీర్, క్లస్టర్ కోఆర్డినేటర్లు భవాని, మౌనిక, అంజనీ, ఫ్యాకల్టీ పురుషోత్తంరెడ్డి, మానస, శ్రీనివాస్, వలంటీర్లు మౌనిక, మానస తదితరులు పాల్గొన్నారు.